క్లుప్తంగా

జగన్ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి



చెర్లోపల్లిలో ప్రచారం చేస్తున్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ తొట్టంబేడు ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. మండలంలోని చెర్లోపల్లి ఎస్సీకాలనీలో బుధవారం సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఆమె ప్రచారంలో పాల్గొన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ పథకాల ద్వారా రూ.3 నుంచి రూ.లక్షల లబ్ధి అందిందన్నారు. పార్టీ మండల ఇన్‌చార్జి వయ్యాల కృష్ణారెడ్డి, సర్పంచ్ పుష్పాంజలి, మిల్క్ సొసైటీ చైర్మన్ మధుసూదన్‌రావు, ఎంపీటీసీ సునీతరెడ్డి, వైస్ ఎంపీపీ భానుయాదవ్, నాయకులు కుసుమమ్మ, వెంకటేష్‌నాయుడు, హరి, నాగరాజు, మణి, రాజ, మునిరాజ్, కల్యాణ్, రామ్మూర్తి, సుధాకర్‌రెడ్డి, భూపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

ఏర్పేడు: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఏపీఎం పళణికుమార్ బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు.

నాగలాపురం : మండలంలోని టీఆర్ఆర్ కల్యాణ మండపంలో గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆసరా నాల్గవ విడత పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ పాల్గొంటారని తెలిపారు. 4.30 గంటలకు బూత్ కన్వీనర్ల సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

ఇష్టపడి చదవాలి

బుచ్చినాయుడుకండ్రిగ: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని హెచ్ఎం రమణయ్య తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సంస్కృతిక కార్యాక్రమాలు ఆకట్టుకున్నాయి.

నాణ్యమైన భోజనం పెట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న గోరుముద్ద మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని వంట నిర్వాహకులకు తహసీల్దార్ పటాన్ మహ్మద్ అలీఖాన్ సూచించారు. బుధవారం వెస్టువరత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలలో భోజన పథకాన్ని తనిఖీ చేసి, పదార్థాల రుచి చూశారు. చేశారు.

కరెంటు షాక్‌తో రెండు ఎద్దుల మృతి

పిచ్చాటూరు: మండలంలోని పులికుండ్రంలో బుధవారం విద్యుత్ షాక్‌తో రెండు ఎద్దులు మృతి చెందాయి. గ్రామస్తుల కథనం మేరకు.. మాలగుంటకు చెందిన రవి ఉదయం పులికుండ్రం గ్రామ రైతు సెల్వం పొలంలో వరి పైరు నాటేందుకు మడక తోలుతున్నాడు. ఆ సమయంలో పొలాన్ని ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొలం నీటిలో కరెంట్ ప్రసరించడంతో రెండు ఎద్దులు షాక్‌తో అక్కడికక్కడే మరణించాయి. ఆ సమయంలో రవి గట్టుపైకి నీరు తాగేందుకు వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న విద్యుత్, పశు సంవర్ధక శాఖ అధికారులు పరిస్థితిని పరిశీలించారు.

నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళం



ధ్వజస్తంభం వద్ద ఎంపీ మేడా రఘునాథరెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి బుధవారం రూ.5,00,116 విరాళంగా అందజేశారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు వారిని ఆశీర్వదించి, స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వేలం ఆదాయం రూ. 17,98,100

నారాయణవనం: నారాయణవనం మేజర్ గ్రామ పంచాయతీకి వివిధ నిర్వహణల వార్షిక వేలం ద్వారా రూ. 17,98,100 ఆదాయం లభించిందని కార్యదర్శి షణ్ముగం తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను డివిజనల్ పంచాయతీ అధికారి ప్రభురెడ్డి ఆధ్వర్యంలో ఆటో స్టాండ్, టూరిస్ట్ వాహన స్టాండ్, దినసరి, వారపు సంతలు, జంతువధశాల, అంగడి రూముల నిర్వహణకు వేలం పాటలను నిర్వహించారు. వారపుసంత రూ 10,00,500, టూరిస్ట్ వాహన స్టాండ్ రూ 6.77 లక్షలు, దినసరి మార్కెట్ రూ 60 వేలు, జంతువధశాల రూ 21 వేలు, రూముల అద్దె నిర్వహణ వేలం ద్వారా రూ 39,500 లభించిందని షణ్ముగం తెలిపారు. ఆటో స్టాండ్ వేలాన్ని వాయిదా వేశామని ఆయన పేర్కొన్నారు.

ఏకలవ్యుడు ఆదర్శనీయుడు

- ఎరుకుల కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయింపు
- ఏకలవ్య విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ఏకలవ్యుని విగ్రహావిష్కరణ శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, నాయకులు

శ్రీకాళహస్తి : లక్ష్య ఛేదనలో గురితప్పని విలుకాడు ఏకలవ్యుడని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కుర్తిలో ఎరుక కులస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకలవ్యుని విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గురువులేకున్నా తిరుగులేని విలుకాడుగా ఏకలవ్యుడు చరిత్రలో నిలిచిపోయారన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలో ఆయన కులానికి చెందిన ప్రజలకు తాను చేతనైన సాయం అందించినట్టు పేర్కొన్నారు. భవిష్యత్తులోను తగిన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఎరుకల జాతి ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. తొలుత ఎరుకల సంఘం నాయకులతో కలిసి ఏకలవ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ భవనానికి తమకు స్థలం కావాలని స్థానికులు కోరడంతో ఎమ్మెల్యే స్పందిస్తూ కేటాయించేందుకు హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలో స్వర్ణముఖి సుందరీకరణలో భాగంగా కరకట్టపై ఏకలవ్య, భక్త కన్నప్ప విగ్రహాలను కూడా ఏర్పాటు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏకలవ్య ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు దాసా రామయ్య, జిల్లా కార్యదర్శి దాసా సుబ్రమణ్యం, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాళ్, నాయకులు మేకల కిరణ్‌కుమార్, శ్రీనివాసరావు, మేడ పోతురాజు, మేకల సురేష్, దాసా చలపతి, దాసా వెంకటయ్య, శ్రీనివాసులు, విజయకుమార్, పొన్నయ్య, మురగయ్య, ప్రభావతి, సురేష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి



సచివాలయం ప్రారంభిస్తున్న ఎంపీ గురుమూర్తి, రాజేష్

సత్యవేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో మీకు మేలు జరిగి ఉంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ కోరారు. ఇరుగుళం పంచాయతీలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ. 21.8లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే సెంటర్, మల్లవారిపాళెంలో 48 లక్షలతో సిమెంటు రోడ్డు, ఇరుగుళంలో రూ. 11 లక్షలతో సిమెంటురోడ్డు పనులను వైఎస్సార్ సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలసి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ప్రారంభిచారు. ఎంపీ మాట్లాడుతూ వెనుక బడిన సత్యవేడు ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు దివంగత నేత డాక్టర్ రాజశేఖర్ రెడ్డి శ్రీసిటీ తీసుకొచ్చారన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు వైఎస్సార్ సీపీకి మెజారిటీ వచ్చేలా పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సత్యవేడు మండల పరిధిలో 28 పంచాయతీల్లో వివిధ పథకాలతో డైరెక్టు బెనిఫిట్, నాన్‌డీబీటీ ద్వారా రూ.313 కోట్లు అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాజేష్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజలు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ, ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.వి జయలక్ష్మి, మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ.నిరంజన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి, మండల యువత అధ్యక్షుడు వంశీకృష్ణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ బి.సురేంద్ర రెడ్డి, వైస్ ఎంపీపీ రాబర్ట్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గజ వాహనంపై పల్లికొండేశ్వరస్వామి



నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీసర్వమంగళ సమేత పల్లికొండేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం శ్రీస్వామి, అమ్మవార్లు గజవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పాలక మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, ఈ ఓ కె.రామచంద్ర రెడ్డిపర్యవేక్షించారు.

ప్రణాళికతో ఉజ్వల భవిష్యత్



సత్యవేడు: పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఈమేరకు ప్రణాళికాబద్ధంగా చదవాలని హెచ్ఎం భారతి అన్నారు. బుధవారం పుదుకుప్పం తమిళం ఉన్నత పాఠశాలలో సరస్వతి పూజ, టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆరోగ్య సురక్ష

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న ఆరోగ్య సురక్షలో ఇంటి ముంగిటే మెరుగైన వైద్యం అందుతోందని వైద్యాధికారి మాధవి తెలిపారు. మండలంలోని వెస్టువరత్తూరు వైఎస్సార్ క్లినిక్ వద్ద గురువారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కింద పైసా ఖర్చు లేకుండా ఉచితంగా 7 రకాల పరీక్షలు చేసి, మందులు, అద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శిబిరానికి విచ్చేసిన వారికి షుగర్, బీపీ, రక్త పరీక్షలు చేశారు. బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులు, తగిన బరువులేని పిల్లలు, క్షయ, కుష్టు వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి శివకుమార్, వైద్య సిబ్బంది. వలంటీర్లు పాల్గొన్నారు.

సామాన్యులకు మెరుగైన వైద్యం

ఏర్పేడు: ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం అందుతున్నట్లు సర్పంచ్ మోహనప్రియ అన్నారు. బుధవారం మండలంలోని ఎండీపుత్తూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. పంచాయతీలోని ఎండీపుత్తూరు, అరుంధతీవాడ, బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీలకు చెందిన 391 మంది శిబిరానికి విచ్చేసి వైద్య పరీక్షలు చేసుకున్నారు. బీపీ, షుగర్, గళ్ల, రక్త, 74 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ముగ్గురిని శస్త్ర చికిత్స, 9 మందికి కంటి అద్దాలకు రెఫర్ చేశారు. వైద్యాధికారులు మధురిమ, రవీంద్రనాథ్‌ఠాగూర్, దీప, రెడ్డి బాలాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పేడు: మందుల కిట్ల పంపిణీ

పుస్తకాలు పట్టే వయసులో పుస్తెల భారం వద్దు



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల ర్యాలీ



పాపానాయుడుపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: చదువుకునే వయసులో పిల్లలపై తల్లిదండ్రులు పుస్తెల భారం మోపకూడదని డీఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం రోజున బాల్యవివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం బాల్య వివాహాల నివారణపై పట్టణంలోని రాజగోపురం వద్ద ఉంచి భారత్ స్కౌట్స్అండ్ గైడ్స్ భారీ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. చేసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కమిషనర్లు ఎంఎం రెడ్డి, రమేష్‌బాబు, యూత్ చైర్మన్ షేక్ అజారుద్దీన్, సహాయ కమిషనర్ పార్వతి, గైడ్ కెప్టెన్ పద్మావతి, స్కౌట్ మాస్టర్లు, జెడ్పీబాలుర, బాలికల ఉన్నత పాఠశాల, బాబుఅగ్రహారం, సరస్వతీబాయి, భాస్కర్‌పేట మున్సిపల్ పాఠశాలలు, ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాల, ఆర్‌సీపీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కౌట్స్ అండ్ గైడ్స్, రోవర్లు, రేంజర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించినా చర్యలు

నారాయణవనం: బాల్య వివాహాలను చేసిన, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్ హెచ్చరించారు. మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా శివపార్వతుల కల్యాణం రోజున అక్కడక్కడా బాల్య వివాహాలను చేయడం ఆచారంగా కొనసాగుతోందని అన్నారు. 18 సంవత్సరాలు నిండని పిల్లలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. సర్కిల్ పరిధిలోని నారాయణవనం, కేవీబీ పురం, పిచ్చాటూరు పోలీసులకు స్పష్టమైన ఆదేశాలను ఇచ్చినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని శైవక్షేత్రాలలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. వలంటీర్లు, గ్రామ మహిళా పోలీసులు సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు అందజేయాలని సూచించారు. బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహనా సమావేశాలను ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ఏర్పేడు: బాల్యవివాహాలను నిర్మూలిద్దామని ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కన్వీనర్ సుబోస్ అన్నారు. బుధవారం మండలంలోని మునగలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ర్యాలీ, వాల్ పోస్టర్ ఆవిష్కరణ, అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగకుండా నియంత్రించాలని సూచించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం నాగమణి, ప్రగతి సంస్థ ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్త శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

పిచ్చాటూరు: మండలంలో ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈనెల 8న శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రామగిరి, కీళపూడి శివాలయాల్లో బాల్య వివాహాలకు ఎవరైనా ప్రయత్నిస్తే 9440900272 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులతో పాటు సహకరించేవారిపై కూడా కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

జైశ్రీ అకాడమీ కళాకారుల నృత్య ప్రదర్శన



సాంస్కృతిక ఝరి... మురిపించె మది



మోక్షశ్రీ నృత్యం

శ్రీకాళహస్తి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కళావేదిక ధూర్జటి కళాప్రాంగణంలో బుధవారం నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హైదరాబాదుకు చెందిన శివాన్స్ డ్యాన్స్ అకాడమీ నృత్యకళాకారుడు శివకుమార్ చేసిన నృత్యం అలరించింది. తిరుచానూరుకు చెందిన శివ నాటక కళా నిలయం, తిరుపతికి చెందిన మోక్షశ్రీ, జైశ్రీ అకాడమీ నృత్యకళాకారులు చేసిన నృత్యాలు రంజింపజేశాయి. శ్రీకాళహస్తి పట్టణం దిస్కూల్ విద్యార్థులు కీర్తనారెడ్డి, విమలేష్‌రెడ్డిల భక్తి విభావరి అలరించింది. అలాగే ఆలయంలో విద్యుద్దీపాలంకరణలు, సెట్టింగ్‌లు భక్తులను మైమరపిస్తున్నాయి.

తెప్పల పరిశీలన



తెప్పలను పరిశీలిస్తున్న ఈఓ, ఆలయ అధికారులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ సారి తెప్పోత్సవాలకు శ్రీస్వామి, అమ్మవార్లకు దేవస్థానం నూతనంగా తెప్పలను తయారు చేయించింది. బుధవారం నారద పుష్కరిణిలో ఈ తెప్పలను ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆలయ ఈఈ నూకరత్నం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు శేష యాళి వాహన సేవలు

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం శ్రీస్వామి, అమ్మవార్లు బంగారు హంస, చిలుక వాహనాలపై పురవీధుల్లో విహరించనున్నారు. రాత్రి శివపార్వతులు బంగారు శేష, యాళి వాహనాలపై భక్తులను కటాక్షించనున్నారు. నాలుగో రోజు మాఘ బహుళ ద్వాదశి సందర్భంగా నిర్వహించే ఈ తిరునాళ్లను నాగరాత్రిగా పిలుస్తారు.

మహా శివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి రోజున లక్షలాదిగా విచ్చేసే భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన దేవస్థానం ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, అన్ని శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను అన్ని శాఖలు సమష్టిగా పని చేసి విజయవంతం చేద్దామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. క్యూల్లో భక్తులకు తాగునీరు, మజ్జిగ వంటివి అందజేయాలని తెలిపారు. దర్శనానికి వచ్చే వృద్ధులు, చంటిబిడ్డల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. శ్రీస్వామిఅమ్మవార్ల ఊరేగింపులో సమయపాలన పాటించాలన్నారు. రథోత్సవం, తెప్పోత్సవం, స్వామి అమ్మవార్ల కల్యాణం రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.





శివకుమార్ నృత్యవిన్యాసం, తిరుచానూరు శివ నాటక కళా నిలయం కళాకారుల నృత్యప్రదర్శన

గుడిమల్లంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం





ధ్వజారోహణం నిర్వహిస్తున్న పూజారులు, ఉత్సవమూర్తుల వద్ద భక్తులు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం శ్రీపరశురామేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. శాస్త్రోక్తంగా జరిగిన ధ్వజారోహణ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తల్లిదండ్రులు సుశీలమ్మ, గోవిందరెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం, నాయకులు దినేష్ యాదవ్, సాయిపెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈనెల 10వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ తెలిపారు.